


# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 41 | పేజీలు : 8 | వెల : రూ.2/- సోమవారం 09 మార్చి 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool






- దేశంలో ఇంకా వివక్ష కొనసాగుతోంది అతివల నైపుణ్యాలను గుర్తించండి
- త్వరలో కాలేజీ అమ్మాయిలకు ఈవీ స్కూటీలు
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై త్వరలో శుభవార్త
- మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ
- దానికి రాజకీయ రంగు పులిమి సానుభూతి పొందుతున్న ప్రతిపక్షాలు : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

# మహిళలకు గుర్తింపు కరువు

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** మనదేశంలోని మహిళలకు, వారి శ్రమకు గుర్తింపు కరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై ఇంకా వివక్ష కొనసాగటం శోచనీయమని అన్నారు. అమెరికాలోనూ వివక్ష ఉందనీ, అయితే అక్కడ కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. మన దేశంలో కూడా అదే రకమైన గుర్తింపును మహిళలు కోరుకుంటున్నారని చెప్పారు. మహిళా జర్నలిస్టులు చెడును నియంత్రించడంలో తగిన పాత్ర పోషిస్తారనీ, సమాజం వారిని విశ్వసిస్తుందని తెలిపారు. ప్రపంచ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే... మహిళలు ఆర్థికంగా ఎదిగి న దేశాలే అభివృద్ధి సాధించాయని చెప్పారు. కానీ ఇండియాలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం తరపున ఒక వ్యవస్థగా మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తున్నామని సంతృప్తిని వ్యక్తం చేశారు. మహిళల్లోని నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్స హించాలంటూ సంస్థలకు, కంపెనీలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని మిగతా2లో...



# ఫైనల్‌లో టీమిండియా
# అఖండ విజయం

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా టీమిండియా హిస్టరీని డిఫిట్ చేసి చరిత్రను తిరగరాసింది. డిపెండింగ్ చాంపియన్ హోదాలో వరుసగా రెండో సారి టీ20 వరల్డ్ కప్‌ను కైవసం చేసుకుంది. తుది పోరులో 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టీ20 మెగా టోర్నిలో మొత్తం మూడు సార్లు ట్రోఫిని కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. ఈ విక్టరీతో ఎంఎస్ ధోని, రోహిత్ శర్మలతో పాటు సూర్యకుమార్ కూడా చరిత్ర పుట్టల్లోకి ఎక్కాడు. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లకుగాను 5 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లు నీషమ్ 3, రచిన్ రవీంద్ర ఒక వికెట్ తీశారు.ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ నిర్దేశించిన లక్ష్యాన్ని 159 పరుగులకు ఆలౌట్ అయింది. కివీస్ బౌలర్లు సిఫెర్ట్(52) అర్థ సెంచరీతో చెలరేగాడు. అలెన్(9), రచిన్ రవీంద్ర(1), ఫిలిప్స్(5), చాంప్‌మన్(3) దారుణంగా విఫలమైయ్యారు. మిగతా2లో...

## నేటి నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్
# సమావేశాలు

- స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చ
- విప్ జారీ చేసిన అధికార, ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 08:** నేటి నుంచి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్న పార్లమెం ట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు హాట్ హాట్ గా కొనసాగనున్నాయి. ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న ఈ సమావేశాలు పండుగలు, సెల వుల కారణంగా కేవలం 17 రోజులు మాత్రమే నిర్వహించే అవకాశం ఉంది. ఎజెండాలోని మొదటి అంశంగా లోకసభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం సహా కీలక అంశాలపై చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంపీలందరూ సభా కార్యక్రమాలకు మిగతా2లో...

# గల్ఫ్‌లో టెన్షన్..టెన్షన్

- వార్ ఉద్రిక్తతలతో స్వదేశానికి 52 వేల మంది



**ముంబయి,మన జనప్రగతి మార్చి 08:** అమెరికా, ఇజ్రాయిల్ దాడులు.. ఇరాన్ ప్రతిదాడుల తో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట యూఏఈ, సౌదీ అరేబి యా, కువైట్, బహ్రెయిన్ మిగతా2లో...



# సామాన్యుడిపై ప్రత్యక్ష దాడి

- గ్యాస్ ధరల పెంపుపై ఐద్వా ఆందోళన
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా
- దేశవ్యాప్త నిరసనలకు పిలుపు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 08:** గ్యాస్ సిలిండర్ల ధరల పెంపును ఉపసంహరించుకోవాలని ఐద్వా అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీకే టీచర్, కనినికా ఘోష్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా మిగతా2లో...

## 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి
# పూర్తి చేస్తాం


- రాష్ట్ర వ్యాప్తంగా భూ సేకరణకు రూ.5 వేల కోట్లు కేటాయిస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేసింది
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 30నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్ట్‌లపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ నీటి పారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేండ్లలోనే ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకు గాను (జూన్ 2 నాటికి) రూ.5వేల కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కృష్ణా, గోదావరి రెండు బేసిన్లలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధిక వరి పండిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశామంటూ గత పాలకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రూ.55 వేల కోట్ల ప్రాజెక్ట్‌లో రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తే అది 90 శాతం పూర్తయినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. వారి హయాంలో నే పాలమూరు అంచనాలను రూ.84 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి నీరివ్వలేదని ఆరోపించారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం జరిగిందన్నారు.ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల మిగతా2లో...

# అసెంబ్లీ 10 రోజులే


- ఐదు రోజులు పబ్లిక్, మరొకటి ఐచ్ఛిక సెలవులు
- ప్రభావితం కానున్న సమావేశాలు



2లో

# సింగరేణిలో టెండర్ల దందా బట్టబయలు

- నెగెటివ్ బిడ్‌తో బయటపడ్డ కాంగ్రెస్ అసలు రంగు
- సింగరేణి లాభాలకు గండి... కార్మికుల బోనస్‌కు కోత పెట్టే కుట్ర : మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** సింగరేణిలో టెండర్ల దందా బట్టబయలైందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతో కాంగ్రెస్ సిండికేట్ బద్ధలైందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. -12 శాతం నెగెటివ్ బిడ్‌తో కాంగ్రెస్ అసలు రంగు బయటపడిందని పేర్కొన్నారు. కమీషన్ల కోసమే మిగతా2లో...

## ఏఐను సమర్థవంతంగా
# వినియోగించాలి

- పోలీసు శాఖకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపు



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** కాలానుగుణంగా నేర పరిశోధనలో అత్యాధునిక కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర పోలీసులకు సూచించారు. ఆదివారం తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ పోలీస్ రిట్రీట్-2026ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం విస్తృతంగా మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09 -03-2026

# మహిళలకు గుర్తింపు కరువు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా భవన్‌లో సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...మహిళలకు తమ పార్టీ మొదటి నుంచి ఎనలేని గౌరవాన్ని, గుర్తింపును ఇచ్చిందన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్ పదవుల్లో మహిళలను కూర్చోబెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా మహిళలకు అవకాశం కల్పించామని, ఏఐసీసీ అధ్యక్షురాలిగా కూడా మహిళలు పని చేశారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు తగిన గుర్తింపును ఇస్తున్నట్టు చెప్పారు. మంత్రుల నుంచి మొదలుకుని వివిధ శాఖల్లో ప్రత్యేక అధికారులుగా మహిళలనే నియమించామని వివరించారు. ఏసీబీ, విజిలెన్స్ లాంటి ముఖ్య విభాగాలతోపాటు ఎప్పుడూ పురుషులే ఉండే ఎస్ఐబీలో ఒక మహిళా అధికారికి అవకాశమిస్తే 700 మంది నక్సలైట్లు లొంగిపోయేలా ఆమె ప్రతిభ చూపించారని ప్రశంసించారు. అవకాశమిస్తే మహిళలు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటారనే దానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని అక్కచెల్లెండ్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించటంతోపాటు వెయ్యి బస్సులకు వారిని యాజమానులను చేసి కార్పొరేట్ కంపెనీ లతో మహిళలు పోటీ పడేలా ప్రోత్సహిం చామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నా రు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లకు వారిని యజమానులను చేసినట్టు చెప్పారు. మహిళా సంఘాల ఉత్పత్తులను మార్కెట్ చేసుకు నేందుకు వీలుగా హైటెక్ సిటీలో వెయ్యి కోట్ల విలువైన మూడున్నర ఎకరాల స్థలంలో 150 స్టాల్స్‌తో మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు.రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయటానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని.. తమ కృషికి అందరూ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని కాలుష్యరహితంగా, జీవనయోగ్య నగరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 2026 డిసెంబర్ నాటికి 2,800 ఆర్టీసీ డీజిల్ బస్సులను పూర్తిగా ఈవీలుగా మార్చబోతున్నట్టు తెలిపారు. రెండు లక్షల ఆటోలను ఈవీ కిందికి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కళాశాలలకు వెళ్లే ఆడపిల్లలకు ఈవీ స్కూటీలను త్వరలోనే అందజేయబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న ఎస్టీపీలు సరిపోవడం లేదని సీఎం తెలిపారు. చెత్త ఎత్తివేయడం, మూసీ ప్రక్షాళన, దోమల నియంత్రణ తదితర సమస్యలకు ఎలాంటి కార్యాచరణ అవసరమో చెప్పాలని మేధావులు, జర్నలిస్టులను కోరారు. సబర్మతీ, గంగానదిని ప్రక్షాళన చేసినప్పుడు మూసీ నదిని ఎందుకు ప్రక్షాళన చేయకూడదని ప్రశ్నించారు. నగరంలోని ఏడెకరాల్లో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో 50 శాతానికి పైగా బఫర్ జోన్‌లో ఉందని గుర్తు చేశారు. అయితే అక్కడి కొనుగోలుదారులు బాధితులుగా మారకుండా వారికి ప్రత్యామ్నయ స్థలంతోపాటు భవన నిర్మాణ ఖర్చులు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ప్రతిపక్షాలు సానుభూతి కోసం రాజకీ యాలు చేస్తు న్నాయని విమర్శించారు. ఎన్జీటీ రూల్స్‌ను తాను కూడా మార్చలేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంతో చర్చించకుండా, వారు గతంలో చేయని పనిని.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయొద్దనే దురుద్దేశంతో కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు.

# సామాన్యుడిపై ప్రత్యక్ష దాడి

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం సందర్భంగా ఆదివారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీకే శ్రీమతి టీచర్, కనినికా ఘోష్ మాట్లాడుతూ దేశంలోని ప్రతీ మహిళకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సాధికారతను సమర్థించే రోజని, అయితే దేశంలోని వంటగదుల్లో వాస్తవికత వేరే కథను చెబుతోందని అన్నారు. ఉపశమనం కలిగించే బదులు, గ్యాస్ ధరలను 60 శాతం పెంచి దేశంలోని మహిళలకు అణిచివేత, ఆర్థిక భారం రూపంలో 'బహుమతి' ఇచ్చారని విమర్శించారు. ఉజ్వల వంటి సంక్షేమ పథకాల విజయాన్ని కేంద్రం ప్రచారం చేస్తున్నప్పటికీ, ధరల పెంపు ఆ పేద లబ్దిదారులనూ వదిలిపెట్టదని అన్నారు. సబ్సిడీ లేని ఎల్పీజీ ఒకే ఏడాదిలో రూ. 110 పెరిగిందని, ఈ వారం వాణిజ్య సిలిండర్ ధర రూ.114.50 పెరిగిందని తెలిపారు. ఈ 'ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణం' రెండు వైపులా పదును గల కత్తి లాంటిదని విమర్శించారు. ఇది ఇంట్లో వండిన ఆహార పదార్థాల ధరను పెంచుతూ, ఇప్పటికే తగ్గిపోతున్న వాస్తవ ఆదాయాలతో కుంగిపోతున్న మధ్యతరగతి, శ్రామిక ప్రజలకు అవసరమైన వస్తువుల ధరలను పెంచుతుందన్నారు. ఈ అస్థిరతకు మూలం.. పెరుగుతున్న పశ్చిమాసియా వివాదంలో ఉందని, బ్రెంట్ ముడిచమురు ఒకేవారంలో దాదాపు 27శాతం పెరగడం, ఎల్ఎన్జీ సరఫరా అంతరాయం ఎదుర్కొంటున్నందున, ఇండియా ఇంధన భద్రత ముట్టడిలో ఉందన్నారు. అయితే, ఈ సంక్షోభం పాశ్చాత్య ఆధిపత్యానికి 'లొంగిపోవడాన్ని' ప్రతిబింబిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూ ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలకు సేవ చేస్తోందని ధ్వజమెత్తారు.

# 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7,161 కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇందులో ప్రాజెక్ట్ పనులకు రూ.6,718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్టు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్ట్‌లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2014 జూన్ 2న ఎలా ఉన్నాయో 2024 జూన్ 2న కూడా అలాగే ఉన్నాయని చెప్పారు. ఎంత ఖర్చయినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించామని చెప్పారు. కల్వకుర్తికి రూ.909 కోట్లు, నెట్టెంపాడుకురూ.252 కోట్లు, భీమాకు రూ.200 కోట్లు, కోయిలసాగర్‌కు రూ.185 కోట్లు కేటాయింపులు జరిగాయని వివరించారు. **జూరాల ప్రాజెక్ట్ డీ సిల్టింగ్** జూరాల ప్రాజెక్ట్‌లో వెంటనే డీసిల్టింగ్ పనులు ప్రారంభించాలని నీటిపారుదల అధికారులకు మంత్రి సూచించారు. ప్రాజెక్ట్ రూపకల్పన సమయంలో దాని స్థూల నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలుగా ఉండగా, మట్టిపొరలు పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం 9 టీఎంసీలకు తగ్గిందని తెలిపారు. 1995లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో గత మూడు దశాబ్దాలుగా సహజంగా పేరుకుపోయిన మట్టి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాజెక్ట్ నుంచి తవ్వి తీసే ఇసుకను గోదావరి పరివాహక ప్రాంతంలోని పనులకు ఉపయోగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యాదాస్ నాథ్, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏఐను సమర్థవంతంగా వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండేదని, పోలీసు అధికారు ల అలుపెరుగని కృషి, త్యాగాలతో నేడు తీవ్రవాదం అంతమైందని పేర్కొన్నారు.భవిష్యత్తు సవాళ్లను ఎదురొనేలా పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన ఉద్దేశమని స్పష్టంచేశారు. డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రిట్రీట్‌లో జరిగే చర్చలు వాస్తవికతకు దగ్గరగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, మాజీ డీజీపీ హెచ్‌జే దొర, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ పాల్గొన్నారు.

# శాసనమండలిని ప్రారంభించిన సీఎం

● హాజరైన మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, స్పీకర్, మంత్రులు



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** అసెంబ్లీ ప్రాంగణంలో అత్యాధునిక హంగులతో ఆధునీకరించిన శాసనమండలిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారుఅనంతరం మండలిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 1905లో నిర్మితమైన ఈ హాల్‌ను రాజస్థాన్, పర్షియన్ శైలి కళలతో నిర్మించగా, ప్రస్తుతం కొత్త హంగులతో ముస్తాబు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణంలో పనిచేసేవి. ఆ తర్వాత ఈ రెండు సభలు వేర్వేరు భవనాల్లో నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో శాసన కార్యకలాపాలు ఒకే ప్రాంతంలో ఉండాలనే లక్ష్యంతో తిరిగి దీనిని ఆధునీకరించారు.



# ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదు: ఖమేనీ హత్యపై ఇరాన్

**టెహ్రాన్ ,మన జనప్రగతి మార్చి 08:** ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీపై దాడి, హత్యకు అమెరికా అధ్య క్షుడు ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదని జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజాని హెచ్చ రించారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఆయన.. తమ నాయకుడి హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.'మేం ట్రంప్‌ను వదిలిపెట్టం. ఖమేనీ హత్యకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. దాడుల్లో మా నాయకుడితో సహా అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సాధారణ విషయం కాదు. దీనికి తగిన రీతిలో మేం ప్రతీకారం తీర్చుకుంటాం' అని హెచ్చరించారు. ఈ సందర్భంగా యుద్ధం నేపథ్యంలో అనేక మంది అమెరికన్ సైనికులను తాము బంధించామని అలీ మరో పోస్టులో పేర్కొన్నారు. వారిని జైళ్లలో ఉంచినట్టు తెలిపారు. ఇరాన్ దాడుల్లో ఆరుగురు యూఎస్ సైనికులే ప్రాణాలు కోల్పోయారంటూ ట్రంప్ తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారని, వాస్తవానికి చాలా మందే చనిపోయారన్నారు. కొన్ని రోజుల తర్వాత ప్రమాదాలు, కల్పిత సంఘటనలతో మృతుల సంఖ్యను పెంచేస్తారని ఆరోపించారు.ప్రస్తుత పరిస్థితులపై లారిజాని స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయిల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని యూఎస్ బలగాలు బందీగా తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. వెనిజులా లో మాదిరిగా ఇరాన్‌లోనూ త్వరగా యుద్ధం ముగించేయాల నుకున్నారని.. కానీ, అది విఫలమైందని అన్నారు. అయితే, యూఎస్ సైనికులను బంధించామంటూ లారిజాని చేసిన ఆరోపణలను అమెరికా ఖండించింది. ఇవి ఆ దేశ ప్రభుత్వ అబద్ధాలు, మోసాలకు మరో నిదర్శనం అని సెంటాకామ్ ప్రతినిధి మీడియాతో అన్నారు.

# ఫైనల్‌లో టీమిండియా ఆఖండ విజయం

(మొదటి పేజీ తరువాయి)

మిచెల్ 17 నిరాశపరిచాడు. కెప్టెన్ శాంటర్న్(42) చివర వరకు క్రీజులో ఉండి ఒంటరి పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. భారత్ బౌలర్లు బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు, వరుణ్, పాండ్యా, అభిషేక్ తలా ఒక వికెట్ తీశారు.ఫైనల్‌లో విజేత జట్టు టీమిండియాకు రూ.27.48 కోట్లు గెలుచుకుంది. రన్నరప్ టీం న్యూజిలాండ్ రూ.14.65 కోట్లు అందుకుంది. ఇక సెమీస్‌లో ఓడిన జట్లలకు రూ.7.23 కోట్లు. అలాగే 5–12 స్థానాల్లో నిలిచిన ఒక్కో టీంలకు రూ.3.48 కోట్లు. 13–20 స్థానాల్లో నిలిచిన ఒక్కో జట్టు రూ.2.28 కోట్లు అందుకోనున్నాయి. 2024లో మొత్తం ట్రోర్నీ ప్రైజ్ మనీ రూ.100 కోట్లు ఉండగా ఈసారి 2026లో రూ.120.37 కోట్లు.

# నేటి నుంచి రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ బీజేపీ మూడు లైన్ల విప్ జారీ చేసింది. అలాగే ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం 11వ తేదీ వరకు సభకు హాజరు కావాలని ఎంపీలకు ఇప్పటికే విప్ జారీ చేసింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా విప్ జారీ చేశాయి. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం, పశ్చిమాసియా దేశాల్లో దాడులు, ఇతర అంశాలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్‌తో పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. అయితే... వెస్ట్ బెంగాల్‌లో అంతర్జాతీయ సంతల్ కాన్‌క్లేవ్ విషయంలో రాష్ట్రపతి ముర్ముకు జరిగిన అవమానం, ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతల అర్ధనగ ప్రదర్శన, ఇతర అంశాలపై విపక్షాలు టార్గెట్‌గా ఎన్డీఏ కూటమి వ్యూహాలు అమలు చేయనుంది.

# గల్ఫ్‌లో టెన్షన్..టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

దేశాలపై నా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తోంది. దీంతో గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న, యుద్ధ పరిణామాల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన భారత పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఈ నెల మొదటి వారంలో గల్ఫ్ దేశాల నుంచి 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నట్టు విదేశాంగ శాఖ ప్రకటించింది. పశ్చిమాసియాలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపింది. "గల్ఫ్ రీయన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి విమానాల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించడంతో మార్చి 1 నుంచి 7 మధ్యలో 52 వేల మందికిపైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో సుమారు 32 వేల మంది భారత విమానాల్లో ప్రయాణించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. విమాన కార్యకలాపాలు ఇంకా అందుబాటులోకి రాని దేశాల్లో ఉన్న భారత పౌరులు.. స్థానిక రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్‌ను సంప్రదించాలి" అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. విదేశాల్లోని భారత పౌరుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, సాయం అవసరమైన వారందరికీ అండగా నిలిచేందుకు స్థానిక ప్రభుత్వాలతో కలసి పనిచేస్తున్నట్టు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉన్న భారత పౌరులు.. స్థానిక అధికారుల మార్గదర్శకాలను, అక్కడి భారత దౌత్య కార్యాలయాలు జారీచేసే సలహాలను పాటించాలని విదేశాంగ శాఖ సూచించింది. ఇప్పటికే అవసరమైన అడ్వైజరీలను స్థానిక భారత ఎంబసీ, కాన్సులేట్ జారీచేశాయని తెలిపింది. అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని తెలిపింది. అదే విధంగా విదేశాంగ శాఖ కార్యాలయంలో ఓ ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. సంప్రదించాల్సిన నంబర్లు 1800118797 (టోల్ ఫ్రీ), 0091 11 2301 2113, 0091 11 2301 4104, 0091 11 2301 7905.

# అసెంబ్లీ 10 రోజులే...

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 08:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు తొమ్మిది లేదా పది రోజులు మాత్రమే నడిచే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ, మండలి సమావేశాలు 30 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గత ఫిబ్రవరి 23న జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అసెంబ్లీ అధికార వర్గాలు సన్నాహాలు చేపట్టాయి. శాసనసభ, శాసన మండలి కార్యదర్శులు సైతం నోటిఫికేషన్ జారీచేశారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. మొదటి రోజు ఉదయం 11:45 గంటలకు అసెంబ్లీ, మండలినుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఆ మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ఈనెల 20న ఉపముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టనున్నారు.సమావేశాలను ప్రభావితం చేయనున్న సెలవులుఅసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 30 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికి సాంకేతికంగా తొమ్మిది లేదా పది రోజులే నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనెల 16 నుంచి సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పండుగలు, ఇతరాల పేరుతో ఐదు రోజులు ప్రభుత్వ సెలవు దినాలు, మరొక రోజు ఐచ్ఛిక సెలవులు వస్తున్నాయి. ఈనెల 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం, 27 శ్రీరామనవమి, 29 ఆదివారం కానున్నాయి. 17న షబ్-ఏ-ఖదర్ పేరుతో సర్కారు ఐచ్ఛిక సెలవును ఇప్పటికే ప్రకటించింది. సెలవులు, ఐచ్ఛిక సెలవు రోజుల్లో నడిపితేనే మొత్తం 15 రోజులు సమావేశాలు జరుగుతాయి. అయితే పండుగల రోజుల్లో సభలు జరగడం సాధ్యం కాకపోవచ్చు. ఒకవేళ ప్రభుత్వం భావిస్తే ఆదివారాల్లో సమావేశాలు కొనసాగించే అవకాశం ఉంది. బడ్జెట్‌ను ఎలాగూ 20న సమర్పిస్తారు కాబట్టి 21న రంజాన్‌తో పండుగ సెలవును బడ్జెట్ అధ్యయనం కోసం వాడుకోవచ్చు. మరుసటి రోజు 22 ఆదివారం కానుంది. ఆరోజు సెలవుగా పరిగణిస్తారా? లేక సభలను కొనసాగిస్తారా ? అనేది అసెంబ్లీ బీఏసీలో నిర్ణయించనున్నారు. ఒకవేళ సభను నిర్వహించాలని భావిస్తే 10 రోజులు నడిచే అవకాశం ఉంది. లేకపోతే ఆరోజును సెలవుగా పరిగణిస్తే సమావేశాలు తొమ్మిది రోజులే జరగనున్నాయి. ఈ మేరకు సెలవులు అసెంబ్లీ సమావేశాలను ప్రభావితం చేయనున్నాయి.**జిష్ణు దేవ్ వర్మనా..శివప్రతాప్ శుక్లానా !** ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్రకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా నియమితులయారు. జిష్టదేవ్ వర్మ ఈలోపు రిలీవ్ అయితే శివప్రతాప్ శుక్లాకు ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడే అవకాశాలు ఉంటాయి.

# సింగరేణిలో టెండర్ల దందా బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీరాంపూర్ టెండర్ ఫైనాన్షియల్ బిడ్‌ను ఏడుసార్లు వాయిదా వేసినట్టు బీఆర్ఎస్ ముందే చెప్పిందని గుర్తు చేశారు. గతంలో సిండికేట్ కుమ్మక్కుతో ౦10 శాతం అదనంగా ప్రజాధనం దోపిడీకి గురైందనీ, ఇప్పుడు -12 శాతానికి టెండర్ వచ్చిందని తెలిపారు. ఓబీ పనుల్లో జాప్యంతో బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో కరెంటు కొనుగోలు చేస్తూ ప్రజల నెత్తిన చార్జీల భారం మోపుతున్నదని విమర్శించారు. సింగరేణి లాభాలకు గండి కొడుతూ కార్మికులు బోనస్‌కు కోత పెట్టే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆస్తి అయిన సింగరేణిని రాజకీయ కమీషన్లకు అడ్డాగా మార్చితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కొత్త నిబంధనలు తెచ్చాక సింగరేణిలో నమోదైన తొలి నెగెటివ్ బిడ్ ఇదేనని తెలిపారు. ముఖ్యమంత్రి బామ్మర్ది సృజన్‌రెడ్డి సిండికేట్‌ను బద్దలు కొడితే అసలైన పోటీ ఎలా ఉంటుందో, ధరలు ఎలా దిగి వస్తాయో ఈ ఒక్క టెండర్ నిరూపించిందని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకుల వాటాల కోసం, ముఖ్యమంత్రి బంధువుల కమీషన్ల కోసం కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం, తెలంగాణ సంపదను కాపాడే విధంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి టెండర్లలో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
09 -03-2026

## మహిళా దినోత్సవం సందర్భంగా 111 మంది మహిళా ప్రతినిధులకు సన్మానం



**పీలేరు మన జనప్రగతి మార్చి 08:-** స్థానికంగా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ పీలేరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్లాంట్ ఇన్‌చార్జ్ పి. శివశంకరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా పాల సేకరణ కార్యక్రమాల్లో పనిచేస్తున్న 111 మంది మహిళా ప్రతినిధులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడిన ప్లాంట్ ఇన్‌చార్జ్ పి. శివశంకరయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండటం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. పాల సేకరణ కార్యకలాపాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్నారని ఆయన అభినందించారు. మహిళా రిజర్వేషన్ విషయానికి వస్తే దేశంలో 33 శాతం రిజర్వేషన్ అమలులో ఉన్నప్పటికీ, హెరిటేజ్ సంస్థలో మహిళలకు 44 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తూ మహిళా సాధికారత దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. మహిళా ప్రతినిధులు కూడా ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థ తమకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలపడేందుకు సహకరిస్తోందని తెలిపారు. సంస్థతో అనుబంధంగా ఉండటం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా హెరిటేజ్ సంస్థ రైతుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమయానికి పాల చెల్లింపులు, పశువుల కోసం ఫీడ్ మరియు ఎం.ఎం.సరఫరా, వెటర్నరీ సేవలు, పశువుల ఆరోగ్య శిబిరాలు, పశువుల కొనుగోలుకు ఫైనాన్స్ లోన్లు, కాటిల్ ఇన్సూరెన్స్, రైతుల కోసం జి.పి.ఏ వంటి సంక్షేమ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల సేకరణ మహిళా ప్రతినిధుల చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం హెరిటేజ్ స్వీట్స్‌ను అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ స్వరణ్ రాజ్, హెరిటేజ్ పాల సేకరణ మహిళా ప్రతినిధులు, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ పీలేరు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయం: కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా





**కర్నూలు బ్యూరో మన జన ప్రగతి మార్చి 08:-** మహిళా పోలీసులు సమాజ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారని వారి సేవలను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా కొనియాడారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూఅమ్మలేనిదే సృష్టి లేదన్నారు. భారతదేశం వసుదైవ కుటుంబం అనే భావనతో ముందుకు సాగుతుందని, అందరూ కలిసి మెలిసి మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. మహిళల భద్రత కు మరియు శాంతి భద్రతల పరిరక్షణలో వారి సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. ఉత్సాహంతో పని చేస్తూ ప్రజలకు మంచి సేవలందించాలని సూచించారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ విధుల్లోనే కాకుండా క్రీడలలో కూడా మహిళలకు స్ఫూర్తిగా రాణిస్తున్న ఆర్ ఎస్సై కల్పన గారిని అడిషనల్ ఎస్పీ శాలువ, మెమెంటోతో ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎఓ విజయలక్ష్మీ, డిటిఆర్బి సిఐ ఆదిలక్ష్మీ, ఆర్ ఐ నారాయణ, మహిళా ఆర్ ఎస్సైలు కల్పన, మహాలక్ష్మీ, మహిళా పోలీసు సిబ్బంది శక్తి టీం, మహిళా హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 08:-** మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యం సంక్షేమమే కాదు తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని డిజిఓ డాక్టర్ జ్యోతి విద్యార్థి చేశారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో హోం లో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ప్రొద్దుటూరు శాఖ నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో కూడా స్త్రీ పురుష సమానత్వం పూర్తిగా రావడం లేదని, స్రీ పురుష నిష్పత్తి కూడా సమానంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఆడపిల్లలకు భద్రత కరువైందన్నారు. ఇంకా ఆడపిల్లల పట్ల చిన్న చూపు చూడటం బాధాకరమన్నారు. ప్రతి ఆడవారి విజయం వెనుక తండ్రి లేదా సోదరుడు లేదా భర్త ప్రోత్సాహం తప్పనిసరిగా వుంటుందని, అలా ప్రోత్సహించే వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మనదేశ రాష్ట్రపతి ఒక మహిళ అని గర్వంగా తెలిపారు. అంతేకాక సమాజంలో ప్రస్తుతం స్త్రీ లు కూడా అన్ని రంగాలలో పురుషులకు సమానంగా రాణిస్తున్నారని వివరించారు. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, మహిళలు పోషకాహారం తీసుకోవాలని, చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ సలహా పొందాలని, వ్యాయామం, వాకింగ్, యోగా, మెడిటేషన్ చేయాలని సూచించారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ రామ సుబ్బయ్య మాట్లాడుతూ ఒక స్త్రీ మహిళలకు ఓటు హక్కు, పని దినాల తగ్గింపు కోసం చేసిన పోరాటం ఫలితంగానే నేటి ఈ మహిళా దినోత్సవ వేడుకలు సాధ్యమయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను, మహిళా విలేకరి జ్యోతికను ఘనంగా సన్మానించారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ప్రొద్దుటూరు కార్యదర్శి ప్రమీల, మహిళా వింగ్ అధ్యక్షురాలు అరుణాదేవి, కన్వీనర్ విజయేశ్వరీ, వైస్ ప్రెసిడెంట్ సంధ్యా రాణి,, జాయింట్ సెక్రటరీ సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ కోటకు బీటలు

### మహదేవపురం టిడిపి ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు కంప రాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీలో భారీ చేరికలు



**సిరివెళ్ల మన జనప్రగతి మార్చి 08:** మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామం మహ దేవపురంలో అధికార తెలుగు దేశం పార్టీ కోట బీటలు వారిం ది. అధికార పార్టీ నేతలు గ్రామంలో చేస్తున్న అక్రమాలు అన్యాయాలపై మహదేవ పురం గ్రామంలోని ప్రజలు విసుగు చెంది ప్రజాప్రతి నిధులను నిలదీయడం వల్ల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం దేవుడి సొమ్ముతో ఆటలాడవద్దని ఎంత చెప్పినా వినని అధికార పార్టీ నేతల వైఖరికి నిరసనగా గ్రామంలో రాజకీయ సమీకర ణలు ఒక్కసారిగా మారిపో యాయి. వైసిపి యూత్ నేత కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వ ర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీ వార్డు మెంబర్లు మరియు టిడిపి కార్యకర్తలు సుమారు 200 మంది రాజేష్ గౌడ్ ఆధ్వ ర్యంలో వైసిపిలో చేరేందుకు సంసిద్ధం అయ్యారు. గ్రామ ప్రజల ఒత్తిడి మరియు నిర్ణయం మేరకు రాజేష్ గౌడ్ కర్నూలు నంద్యాల ఉమ్మడి జిల్లాల వైసిపి పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి , దృష్టికి జిల్లా ఆళ్లగడ్డ అసెంబ్లీ మాజీ ఎమ్మెల్యే గంగుల భీజేంద్రరెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు , రాయలసీమ సీనియర్ పొలిటీషియన్ పెద్దాయన శ్రీ. గంగులప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీ.గంగుల.బ్రిజేంద్రరెడ్డి (నాని) అన్న గారి సమక్షంలో వైయస్ ఆర్ ర్ పార్టీ కండువాని కీలక నేతలు ప్రముఖులు కప్పుకు న్నారు. ఈ క్రమంలో మహదేవ పురం తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎక కాలంలో సుమారు 200 మంది వైసిపి లో చేరి పార్టీ కండువ కప్పుకున్నారు. దాదాపు సుమారు 200 మంది తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్య అను చరులు ఒకేసారి పార్టీ మార డంతో మహాదేవపురం గ్రామంలో కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీలో సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలుగు దేశం పార్టీ శ్రేణులు డీలా పడ్డారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న నేప థ్యంలో కార్లు బాడుగకు అందుబాటులో లేకపోవ డంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం సుమారు 30 వాహనా లను మహదేవపురం గ్రామా నికి రప్పించి వైసిపిలో చేరే గత తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులను ప్రముఖులను కార్యకర్తలను కంపరాజు రాజేష్ గౌడ్ ఆళ్లగడ్డకు తరలించారు. రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో గంగుల సమక్షంలో పార్టీలో చేరిన వారిని గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి ప్రేమ పూర్వకంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి వైసీపీ తీర్థం అందజేశారు. ఈ సందర్భం గా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండదండగా నిలుస్తుందని తెలియజేశారు. మహదేవ పురం గ్రామం నుండి 30 వాహనాలలో సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలి రావడం వల్ల మార్గమధ్యంలో ఎటువంటి అవాంతరాలు ఆటంకం ఎదురుకాకుండా కెమెరాల మధ్య ఆళ్లగడ్డకు చేరుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపికన్వీనర్ ఇందూరి . ప్రతాప్ రెడ్డి గారు, జిల్లా వైసీపీ వైస్ ప్రెసిడెంట్.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, మందాలశివారెడ్డి,వంక దార సుబ్బ సత్యనారాయణ జింకల నాగన్న, గుండంపాడు ప్రతాపరెడ్డి, కొట్టే జయ లక్ష్మమ్మ , పిక్కిలి నరహరి, మహాదేవ పురం ,గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, పలువు రు వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు వన్ స్టాప్ సెంటర్ సేవలు: ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్




**ఆదోని మన జనప్రగతి మార్చి 08:-** ఆదోని పరిసర ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా సమగ్ర సేవలు అందించబడుతున్నాయి. కుటుంబంలో, సమాజంలో, కార్యాలయాల్లో లేదా ఇతర ప్రజా మరియు వ్యక్తిగత ప్రదేశాల్లో హింసకు గురైన మహిళలకు ఒకే చోట అవసరమైన సహాయం అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం అని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆదోని ప్రభుత్వం జనరల్ హాస్పిటల్ లో శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి అనంతరం అధికారులతో కలసి మహిళలకు అత్యవసర సహాయం అందించే ఉమెన్ హెల్ప్ లైన్ – 181 మరియు పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలపై జరిగే అన్ని రకాల హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు తక్షణ, అత్యవసర మరియు ఇతర అవసరమైన సేవలు అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అత్యవసర స్పందన మరియు రక్షణ సేవలు, వైద్య సహాయం, మహిళలు ఎఫ్.ఐ. ఆర్/ ఎన్.సి.ఆర్/ డి.ఐ. ఆర్ నమోదు చేయడంలో సహాయం, మానసిక–సామాజిక కౌన్సెలింగ్,న్యాయ సహాయం,అవసరమైన వారికి ఆశ్రయం, అలాగే వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం వంటి సేవలు అందించబడుతున్నాయి. వన్ స్టాప్ సెంటర్ సేవలు 18 సంవత్సరాల లోపు బాలికలు సహా అన్ని మహిళలకు అందుబాటులో ఉంటాయి. కులం, మతం, వర్గం, ప్రాంతం, లైంగిక అభిరుచి లేదా వివాహ స్థితి వంటి భేదాలు లేకుండా హింసకు గురైన మహిళలు ఈ సేవలను పొందవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ..మాట్లాడుతూ, కర్నూలు జిల్లాలో రెండవ వన్ స్టాప్ సెంటర్ ను ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి వన్ స్టాప్ సెంటర్ కర్నూలులో పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సెంటర్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం 0 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల హింసకు గురైన మహిళలకు పునరావాసం,న్యాయ సహాయం, వైద్య సేవలు, పోలీసు సహాయం వంటి అన్ని అవసరమైన సేవలను ఒకే చోట అందించడం అని వివరించారు. బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించి వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం కల్పించే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఈ సదుపాయాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే హింసకు గురైన మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని,పిల్లలకు సంబంధించిన సమస్యల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సంప్రదిస్తే సంబంధిత సిబ్బంది వారి వద్దకు చేరుకుని అవసరమైన వైద్య మరియు ఇతర సహాయ సేవలు అందిస్తారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 10 వన్ స్టాప్ కేంద్రాలను ప్రారంభించారు. అందులో కర్నూలు జిల్లా ఆదోని లో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ కూడా ఒకటిగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా మహిళల సాధికారత,సంక్షేమం మరియు భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశాన్ని ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) వారి ఆధ్వర్యంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు,సిబ్బంది కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు అత్యవసర సహాయం, న్యాయ సహాయం, వైద్య సేవలు,కౌన్సెలింగ్ వంటి సేవలను ఒకే కేంద్రం ద్వారా అందించడమే వన్ స్టాప్ సెంటర్ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఢిల్లీశ్వరి,హాస్పిటల్స్ సూపర్డెంట్ యం.నాగరాజు శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి




**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 08:-** అవయవ దానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా కొవ్వూరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొవ్వూరు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో అవయవ దాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ నుండి ఐఎంఏ భవన్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున డాక్టర్లు, రొటేరియన్లు, వెటర్నరీ కళాశాల సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఐఎంఏ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ అవయవ దానం పట్ల ఆధునిక సమాజంలో కూడా చాలామందికి అపోహలు వున్నాయని, వాటిని విస్మరించి ప్రతి ఒక్కరూ మరణానంతరం అవయవ దానం చేయాలని, కిడ్నీ వంటివి బ్రతికున్న సమయంలో చేసే దానాలు చేయాలని వివరించారు. అనంతరం ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అవయవదానం పై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై వుందన్నారు. అవయవదానం చేసేందుకు ఇటీవల కాలంలో చాలామంది ఆసక్తితో వున్నా చేసే మార్గం తెలియదని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమ నిర్వహణ ప్రశంసనీయమన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ 2003లో తనకు లివర్ మార్పిడి జరిగిందని, 2007లో కిడ్నీ మార్పిడి జరిగిందని వివరించారు. తనకు కాలేయం అందించిన యువతి జ్ఞాపకార్థం ట్రస్ట్ ఏర్పాటు చేసి మహిళలకు తక్కువ వడ్డీ రుణాలు, కుట్టు మిషన్ల పంపిణీ, పలు అవగాహన కార్యక్రమాలు చేశానని, గత సంవత్సరం 3కె, 5కె రన్ నిర్వహించామని, ఈ సంవత్సరం ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామని వివరించారు. అవయవ దానం తర్వాత తాను ఆరోగ్యంగా వున్నానని తిరుమల, విజయవాడ పాదయాత్ర కూడా నిర్వహించానని వివరించారు. అనంతరం ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని సూచించారు. అవయవదానం చేసే వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సాహం వుంటుందని తెలిపారు. కాగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అవయవ దానం ఫాం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ సురేష్ శ్రీనివాస్, రొటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09 -03-2026

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**కడప మన జనప్రగతి మార్చి 08:–** మహిళలు అభివృద్ధి అంటేనే సమాజ పురోగతి మహిళా సాధికారిక సాధ్యమైనప్పుడే దేశాభివృద్ధి పూర్తిగా సహకారం అవుతుందని. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగాలని వైసీపీ నాయకులు మహిళా దినోత్సవ సందర్భంగా ఆకాంక్షించారు.కడప నగరంలోని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు టిపి.వెంకటసుబ్బమ్మ మరియు నగర మహిళా అధ్యక్షురాలు బండి దీప్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసిన మాజీ మంత్రి ఎస్.బి.అంజాద్ భాష,బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా,ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి,కడప నగర మేయర్ పాక సురేష్ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి .ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు డివిజన్ ఇంచార్జిలు,అనుబంధ సంఘాల నాయకులు నాయకురాలు, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నవదంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి దంపతులు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:** మొపూరి దేవస్థానం ఛైర్మన్ ఓబులరెడ్డి రమణ రెడ్డి కుమారుడు ఓబులరెడ్డి ధనంజయ రెడ్డి – శృతి దంపతులు ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన విషయం విదితమే.ఈ నేపథ్యంలో ఆదివారం శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మరియు వారి సతీమణి శ్రీమతి భూమిరెడ్డి ఉమాదేవి నవదంపతులకు వారి నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన వధూవరులు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో,అన్యోన్యంగా వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.ఈ ఆత్మీయ కలయికలో ఓబులరెడ్డి కుటుంబ సభ్యులు మరియు ఇతర ముఖ్య అనుచరులు పాల్గొన్నారు.

## మహిళలు తమ హక్కులను అందిపుచ్చుకోవాలి

**- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య శ్రీరామ్ పిలుపు**



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 08:–**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మహిళలందరికీ బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య శ్రీరామ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు కేవలం గృహానికే పరిమితం కాకుండా, సమాజంలో తమకు ఉన్న హక్కులను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె హితవు పలికారు.మహిళా శక్తికి వందనంఈ సందర్భంగా సౌభాగ్య శ్రీరామ్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని కొనియాడారు. చట్టసభల్లో రిజర్వేషన్ల నుంచి మొదలుకొని, సామాన్య మహిళల ఆర్థికాభివృద్ధి వరకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు నేడు అనంతపురం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించబోయే "స్త్రీ శక్తి పంచకం" మరియు ఉచిత వైద్య శిబిరం గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఉదయం 10:00 గంటల నుండి.మహిళా శక్తిని చాటిచెప్పే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సౌభాగ్య శ్రీ రామ్ ఆకాంక్షించారు.

## నవధాన్యాలతో భూమికి పునర్జీవం

- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన.
- దుర్గన్నగారిపల్లిలో రైతులకు 80 నవధాన్యాల కిట్లు సిద్ధం.
- ఖర్చు తగ్గించి మంచి దిగుబడులు సాధ్యమని అధికారుల సూచన.



**వేముల మన జనప్రగతి మార్చి 05:–** వేముల మండల పరిధిలోని స్థానిక దుర్గన్నగారిపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...ప్రస్తుత రసాయన వ్యవసాయం కారణంగా భూమి సారాన్ని కోల్పోయి నిస్సారంగా మారుతున్నదని తెలిపారు.అందువల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించాలని సూచించారు.రుతుపవనాల కంటే ముందుగా ఖాళీగా ఉన్న బీడు భూముల్లో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (నవధాన్యాలు) పద్ధతిలో పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు.విత్తిన నవధాన్యాలను సుమారు 65 రోజుల పూత దశలో పశువులకు మేతగా ఉపయోగించి,మిగిలిన అవశేషాలను భూమిలో కలిపితే భూమి సారవంతం పెరిగి ప్రధాన పంటలకు అవసరమైన సూక్ష్మ,స్థూల పోషకాలు అందుతాయని వివరించారు.దుర్గన్నగారిపల్లి గ్రామంలోని లక్ష్మీదేవి తిరుపాలరెడ్డి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో రైతుల కోసం 80 నవధాన్యాల కిట్లు తయారు చేసి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.అవసరమైన రైతులు ఈ కిట్లను తీసుకుని వినియోగించుకోవాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి జి.ఓబులేసు మాట్లాడుతూ...ఇలాంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా భూమికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు రైతులు పెట్టుబడిని తగ్గించుకుని మంచి దిగుబడి సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్,ఎన్ఎఫ్ఏ శ్రీనాథ్ రెడ్డి,డివిజనల్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి,యూనిట్ ఇంచార్జ్ కృష్ణయ్య,రామ్మోహన్ నాయుడు,వెంకటేష్,ఐ.సి.ఆర్.పి నరసింహులు ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్,గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు

## పులివెందుల బి.సి.హాస్టల్‌లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు సొంత నిధులతో క్రికెట్ కిట్ పంపిణీ చేసిన రామగోపాల్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:**పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ బి.సి.బాలుర వసతి గృహం–2ను ఆదివారం శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.వసతి గృహంలోని గదులు,వంటశాల మరియు పరిసరాలను స్వయంగా పరిశీలించిన ఆయన,విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ కోడిగుడ్డు,పాలు మరియు ఇతర పోషకాహార పదార్థాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని ఎమ్మెల్సీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో పరిశుభ్రత,తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు.చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో కొనుగోలు చేసిన క్రికెట్ కిట్లను విద్యార్థులకు అందజేశారు ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా హక్కులకై స్త్రీలు ఉద్యమించాలి



**పత్తికొండ మన జనప్రగతి మార్చి 08:–**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పత్తికొండ పట్టణంలోని స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయం ఈశ్వర్ రెడ్డి భవనంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, మహిళా మండలి అధ్యక్షురాలు అంజనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర మాట్లాడుతూ మహిళా హక్కుల సాధన కోసం స్త్రీలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెలలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు మరియు మహిళా సంఘాలు వేతనాల పెంపు కోసం ఉద్యమాలు చేపట్టాయని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మహిళల సమస్యలను పట్టించుకోకుండా శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమాలను అణచివేయడం దురదృష్టకరమన్నారు.ఎన్నికల సమయం దగ్గరపడితే అధికార, ప్రతిపక్ష పార్టీలు మహిళలపై ప్రేమ చూపిస్తూ ఎన్నో హామీలు ఇస్తాయని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోవడం సాధారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ, ప్రభుత్వ అధికారుల వైఫల్యాల వల్ల నేటికీ మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల కారణంగా మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పావని, అంగన్వాడీ కార్యకర్తలు అంజనమ్మ, సోమేశ్వరి, షాజహాన్, లక్ష్మీనరసింహ, జ్యోతి, కాంతమ్మతో పాటు ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరోగ్యమేమహాభాగ్యం... మన స్వయం కృషి మన ఆదాయం: కిషోర్ ప్రభుత్వ ఉద్యోగి



**కలికిరి మన జనప్రగతి మార్చి 08:–** పీలేరు నియోజకవర్గం కలికిరి ధరణి హోటల్ సమీపంలో పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వెస్టేజ్ కంపెనీ వ్యాపార అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారా పిల్లల విద్యాభ్యాసం కోసం,నిరుద్యోగులు ఉద్యోగాల కోసం మధ్యతరగతి కుటుంబాలు చాలీచాలని డబ్బులుతో ఇబ్బంది పడుతున్నారా వీటన్నిటికీ చక్కని పరిష్కారం వెస్టేజ్ ప్రోడక్ట్ వ్యాపారాన్ని ప్రారంభించండి.వ్యాపారం ద్వారా ఒకరికొకరు సహాయకారిగా ఉండండి మీ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోండి అని అవగాహన కల్పిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వెస్టేజ్ ప్రొడక్షన్ వ్యాపార రంగ నిష్ణాతులు కిషోర్ వెస్టేజ్ ఉత్పత్తుల గురించి అవగాహన కార్యక్రమంలో కల్పించారు.బ్యాంకు బ్యాలెన్స్ కారు,విదేశీయాత్ర పిల్లలకు మంచి చదువులు, బంగారు,ఆరోగ్యం,మౌలిక వసతులు ప్రతి వ్యక్తికిఅవసరం.రెడ్ సిల్ మార్కెట్ వస్తువు ప్రసారాలు వల్ల నష్ట పోతున్నాం. వెస్టేజ్ అంటే పురాతన అడుగు జాడలు.దీని అధినేత గౌతమ్ ప్రారంబించారు.500ప్రోడక్ట్స్ ఉన్నాయి.వ్యాపారంలో దమ్ము వుంది.ఎటువంటి పరిమితులు లేకుండా ఎవరైనా ఎప్పుడైనాఎక్కడైనా చేసుకోవచ్చు. పురాతన పద్ధతులులో రోజు వారి చూసు కొనేవే పెద్దలు ఉపయోగించే వారు. ఇప్పుడుఅవి అన్ని కనుమరుగయ్యే పరిస్థితులు.వంట నూనేలు వల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయి.తినే ఆహారం,పీల్చే గాలి వల్ల ఆకస్మిక మరణాలు వ్యాపిస్తున్నాయి.13రకాల విటమిన్స్ మినరల్స్ అవసరం.పౌష్టికాహారం రాచ వైద్యం,అవిసె గింజలు నూనె,చక్కర వ్యాధివేపగింజలనూనె,దంపుడు బియ్యం నూనె వాడాలి.రసాయనాల తగ్గించే పదార్థాలు అంతర్జాతీయ పదార్థాలు 5500 కోట్ల టర్నోవర్ 11 దేశాల్లో వ్యాపారం.9రకాల వ్యాపారం.పారన్ పండ్.31దేశాలు యాత్ర సౌకర్యం.కార్ పండ్,కెమికల్ లేని నూనెలు వాడమని చెప్పడమే మీరు కాబోయే వ్యాపార దిగ్గజాలు.మూడు తరాలకు బెనిపెట్ అందుతుంది.అద్భుతమైన వ్యాపారం.ప్రసాద్ యుసిడి భువనేశ్వరరెడ్డి సిల్వర్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల అభివృద్ధిపై వైఎస్ కుటుంబం చిత్తశుద్ధి.

- రూ.2 కోట్ల ఎంపీ నిధుల కేటాయింపు.
- యర్రగుడిపల్లిలో సి.సి.రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన వైఎస్ మనోహర్ రెడ్డి.



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:–** పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై వైఎస్ కుటుంబం తమకున్న చిత్తశుద్ధిని మరోసారి చాటుకుంది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి,ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సుమారు రూ.2 కోట్ల ఎంపీ నిధులను కేటాయించారు.ఇందులో భాగంగా యర్రగుడిపల్లిలో రూ. 50 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మరియు ఇతర వైసిపి నాయకులు ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు.కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం..వైఎస్సార్సీపీ చొరవగత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు పనులకు టెండర్లు పిలిచినప్పటికీ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులు నిలిచిపోయాయి. అధికారులు,మంత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో,స్థానిక కౌన్సిలర్లు వైఎస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జగన్ మోహన్ రెడ్డి,అవినాష్ రెడ్డిల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.ప్రజా అవసరాలను గుర్తించిన వారు తక్షణమే స్పందించి భాకరాపురం,న్యాక్ బిల్డింగ్ సమీపంలోని వైఎస్సార్ కాలనీ, మరియు యర్రగుడిపల్లి రోడ్ల కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నిధుల కొరత లేకుండా పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని మున్సిపల్ అధికారులను,కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో వైఎస్ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని ఆయన పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ రాష్ట్ర చైర్మన్ రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్,కౌన్సిలర్లు కోడి రమణ,పురుషోత్తం పాల్గొన్నారు.అలాగే రాష్ట్ర నాయకులు చంద్రమౌళి,కోళ్ల భాస్కర్,వైసిపి నేతలు రమణా రెడ్డి,కృష్ణమూర్తి,సూరి,కనక, సమేవుల్లా, ప్రకాశం,యర్రగుడిపల్లి నాయకులు,కార్యకర్తలు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## జెఎన్‌టీయూ పులివెందులలో 'రివిట్ ఆర్కిటెక్చర్' వర్క్‌షాప్ ముగింపు

- సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ.



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:–**స్థానిక జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న 'రివిట్ ఆర్కిటెక్చర్ అండ్ నవీస్ వర్క్స్ వర్క్‌షాప్ శనివారం విజయవంతంగా ముగిసింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పి.ఎస్.ఎస్.డి.సి.) ఆధ్వర్యంలో మార్చి 2 (సోమవారం) నుండి మార్చి 7 (శనివారం) వరకు ఈ శిక్షణా తరగతులు కొనసాగాయి.ఈ ఆరు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్‌లో ఏ.పి.ఎస్.ఎస్.డి.సి. ఫ్యాకల్టీ ట్రైనర్ కోమలి విద్యార్థులకు సివిల్ ఇంజనీరింగ్‌లో అత్యంత కీలకమైన 3ఌ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ 'రివిట్ ఆర్కిటెక్చర్' పై లోతైన శిక్షణ ఇచ్చారు.బిల్డింగ్ మోడల్స్ డిజైన్ చేయడం, నిర్మాణ నమూనాలను ఆధునిక పద్ధతుల్లో రూపొందించడంపై ఆమె విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరిస్తూ మెళకువలు నేర్పించారు.ఈ సాఫ్ట్‌వేర్ వినియోగంపై విద్యార్థులు సాధించిన పట్టు వారి కెరీర్‌కు ఎంతో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ బిల్డింగ్ నిర్మాణ నమూనాలకు సంబంధించిన ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా లభించే సమాచారంతో విద్యార్థులకు ప్రతిష్టాత్మక సంస్థలలో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ మాట్లాడుతూ సివిల్ విద్యార్థులు ఇటువంటి సాఫ్ట్‌వేర్ కోర్సులను నేర్చుకోవడం ద్వారా తమ ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.సివిల్ విభాగం హెడ్ (హెచ్.ఓ.డి.)డాక్టర్ వై.రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ.పి.ఎస్.ఎస్.డి.సి.ద్వారా కల్పిస్తున్న ఇటువంటి గొప్ప అవకాశాన్ని విద్యార్థులందరూ చక్కగా వినియోగించుకున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కోఆర్డినేటర్ బి.దిలీప్ కుమార్ రెడ్డి, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ జి.శివనాథరెడ్డి,ఎన్.మురళీ మోహన్,బి.ఎల్.నిరంజన్ రెడ్డి,ఎన్.మాధవరెడ్డి,ఎస్. జ్యోతిర్మయి మరియు సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు

## వేంపల్లె లో కన్నుల పండుగగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 08:-**స్థానిక సాయినగర్ లో ఉన్న శ్రీ దుర్గమ్మ దేవి ఆలయంలో కన్నుల పండుగగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరిగింది. గత మూడు రోజులుగా శ్రీ దుర్గమ్మ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం దుర్గమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో ప్రతిష్ట హోమం, శాంతి పౌష్టిక హోమం, యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, మంగళ హారతి లాంటి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం శంకర మంచి సాయి ప్రసాద్, సుబ్బరామశర్మ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. దుర్గమ్మ దేవి ఆలయంలో జరిగే కళ్యాణోత్సవానికి భారీ సంఖ్యలో మహిళా భక్తులు విచ్చేయడం జరిగింది. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు మహిళా భక్తులతో కిటకిటలాడింది.అనంతరం విగ్రహ ప్రతిష్టకు వచ్చిన భక్తులు అందరికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఆలయంకు వచ్చిన భక్తులు అందరికి దుర్గమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి కూడ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.ఆలయానికి తులసిరెడ్డి రావడంతో దేవస్థానం తరుపున జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి ఆయనకు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉరవకొండలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### మహిళా మణులకు ఘన సత్కారం




**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 08:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండలోని శ్రీ వీరశైవ కళ్యాణ మండపంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉరవకొండ నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి, డిప్యూటీ కలెక్టర్ టి. పద్మావతి, ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ బి.ఎన్. శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. **ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో..** ఈ వేడుకల్లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల మహిళా సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, గ్రామ సమైక్య గ్రూపుల లీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరితో పాటు మండల రెవెన్యూ అధికారులు మండల ప్రజా పరిషత్ అధికారులు వెలుగు ప్రాజెక్ట్ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు సహాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.**ప్రతిభామూర్తులకు పురస్కారాలు** వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన మహిళలను ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాజకీయ ప్రముఖులు: మాజీ ఎంపీపీ సుంకు రత్నమ్మ (ఆమిద్యాల), ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మహిళా సాధికారతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిత్తూరులో ఘనంగా అస్మిత లీగ్ క్రీడా పోటీలు

**చిత్తూరు మన జనప్రగతి మార్చి 08:-**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మై భారత్ చిత్తూరు మరియు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అస్మిత లీగ్ క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ఆడపిల్లలు, మహిళలు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా అండర్ - 13,అండర్-18 మరియు సీనియర్ విభాగాలలో మహిళల కోసం పరుగుల పందెం పోటీలు నిర్వహించారు. అండర్-13 విభాగంలో జీ.లాస్య, రమ్య, హర్షితా విజేతలుగా నిలిచి ప్రశంసలు అందుకున్నారు.అండర్-18 విభాగంలో ధనశ్రీ మొదటి స్థానంలో నిలిచింది.భారతి రెండో స్థానం, కామాక్షి మూడో స్థానం సాధించి ప్రతిభ కనబరిచారు. సీనియర్ విభాగంలో కౌసల్య మొదటి స్థానం, నాగేశ్వరి రెండో స్థానం, శృతి మూడో స్థానం సాధించి అందరి అభినందనలు పొందారు.కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం టగ్ ఆఫ్ వార్ పోటీలను కూడా ప్రత్యేకంగా నిర్వహించామని జిల్లా యువజన అధికారి బి. ప్రదీప్ కుమార్ తెలిపారు. మహిళలు క్రీడలలో మరింత చురుకుగా పాల్గొనాలని, ఇలాంటి పోటీలు వారి ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. ఉదయ భాస్కర్ మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో సమానంగా క్రీడలలో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని అన్నారు. క్రీడల ద్వారా దేశానికి పతకాలు సాధించి గౌరవం తీసుకురావాలని ఆయన మహిళలను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో గణంకాధికారి ఎం.సి బాబు రెడ్డి, ఫెన్సింగ్ కోచ్ కార్తీక్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారిణులు, కోచ్‌లు మరియు క్రీడాభిమానులు కార్యక్రమానికి హాజరై పోటీలను ఆసక్తిగా వీక్షించారు.విజేతలకు అభినందనలు తెలియజేస్తూ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.




## మహిళ అభివృద్ధి దేశ అభివృద్ధికి కొలమానం



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 08:-**మహిళ అభివృద్ధి దేశ అభివృద్ధికి కొలమానమని విజయభారతి పాఠశాల కరస్పాండెంట్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక విజయభారతి పాఠశాలలో మహిళా ఉద్యోగులను విజయభారతి పాఠశాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రూపంలోనూ మహిళలు ప్రపంచాన్ని నడిపిస్తున్నారు చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళాలు వంటగదికే పరిమితం కాకుండా ఆయా రంగాల్లో రాణిస్తున్ననట్లు చెప్పారు. ఎన్నో చట్టాలు వచ్చిన మహిళాలపై ఆయా ప్రాంతాల్లో దాడులు, వేధింపులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయాని వాటిని నిర్మూలన చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మగవారితో సమానంగా మహిళలు కూడ ఆయా రంగాల్లో రాణించడం వలన దేశం అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. అనంతరం మహిళా కానిస్టేబుల్ రమణమ్మ, అంగన్ వాడి టీచర్ భాగ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త తులసి, ఆపోఫా మహిళ విభాగం వైస్ ప్రెసిడెంట్ నాగలక్ష్మిలను పాఠశాల తరుపున సన్మానం చేశారు. తమను గుర్తించి సన్మానం చేసినందుకు విజయభారతి పాఠశాల యాజమాన్యంకు మహిళా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి: పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 08:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నైనా ఆడబిడ్డ నిధి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా మహిళల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన బంగారు తల్లి, అమ్మ హస్తం పథకాలను కూడ పునరుద్ధరించాలని చెప్పారు. 1914 సంవత్సరం నుంచి మార్చి 8న ప్రతి ఎడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపు కొంటున్నట్లు చెప్పారు. మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారతను సాధించడమే మహిళా దినోత్సవం లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీ తొలి నుంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తు ఉందని చెప్పారు. అనిబిసెంట్, సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ ఏఐసిసి అధ్యక్షులుగా పదవులు అలంకరించారని చెప్పారు.కేంద్రం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాధికారిత కోసం డ్వాక్రా పథకాన్ని, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు, వడ్డీ లేని రుణాలు, విద్యా ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, బంగారు తల్లి, అమ్మ హస్తం లాంటి పథకాలను అమలు చేశాయని తులసి రెడ్డి గుర్తు చేశారు.వైసిపి పాలనలో మహిళా దినోత్సవం రోజున అమరావతి మహిళ మీద దుశ్శాసనపర్వం జరగడం దురదృష్టకరమన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం అంగన్వాడీ మహిళ పట్ల వ్యవహరించిన తీరు అమానుషమని చెప్పారు. తొమ్మిది రకాల నిత్యా వసర వస్తువులను సబ్సిడీ ధరకు చౌక దుకాణాల ద్వారా తెల్ల కార్డుదారులకు అందించే విధంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి , కూటమి ప్రభుత్వాలు ఈ పథకాన్ని రద్దు చేయడం శోచనీయం అన్నారు. అమ్మ హస్తం పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వానికి తులసి రెడ్డి సూచించారు

## లయోలా డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో మహిళా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రిన్సిపల్ ఫాదర్ జ్యోతి రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వన అధ్యక్షతన జరిగిన వేడుకలలో ముఖ్యఅతిథిగా పట్టణంలోని జేఎన్టీయూ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ హాజరయ్యారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు అన్ని రంగాలలో పురుషలతో పాటు సమానంగా మహిళలు కూడా రాణిస్తున్నారని మరియు గతంలో పోలిస్తే ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల యొక్క విద్యాభ్యాసం చాలా శాతం పెరిగిందని మరియు దేశానికి గర్వకారణమైన సివిల్స్ ఆర్మీ ఇస్రో వంటి పెద్ద పెద్ద అత్యున్నతమైన స్థానాలలో మహిళలు కూడా ఉన్నారని మనం కూడా వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరాలని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అన్ని రంగాలలో స్థానాలు కలిగిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవడం మన బాధ్యతని వారి పేర్కొన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కళ్యాణి రెడ్డి,ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ హిమజ,ఇతర మహిళ సిబ్బంది,విద్యార్థినీలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు




## వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన భూమిరెడ్డి ఉమాదేవి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:-**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో ఆదివారం పోతుల నరేష్ సోదరి అంకిత మరియు సాయికుమార్ నాయుడుల వివాహ మహోత్సవానికి శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ)భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి హాజరయ్యారు.వివాహ వేడుకలో పాల్గొన్న భూమిరెడ్డి ఉమాదేవి నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.నవదంపతులు నిండు నూరేళ్లు అన్యోన్యంగా, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జివి రమణ మరియు పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడపలో ముద్రగడ పద్మనాభం కలిసిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గువ్వల శ్రీకాంత్ రెడ్డి



**శింగనమల మన జనప్రగతి మార్చి 08:-** కడప నగరంలోని మాధవి కన్వెన్షన్ హాల్ ఆదివారం రాజకీయ ప్రముఖుల రాకతో సందడిగా మారింది. అనంతపురం టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు గుజిరి వెంకటేష్ కుమారుడి వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి హాజరైన ప్రముఖ కాపు నేత, వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మరియు రాప్తాడు నియోజకవర్గ పరిశీలకులు గువ్వల శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.కడప మాధవి కన్వెన్షన్ హాల్.గుజిరి వెంకటేష్ (మాజీ అధ్యక్షులు, అనంతపురం టౌన్ బ్యాంక్) కుమారుడి వివాహ మహోత్సవం లోముద్రగడ పద్మనాభంను కలిసిన గువ్వల శ్రీకాంత్ రెడ్డి. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి, గుజిరి వెంకటేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## అందరికీ అందుబాటులో ఎస్వీ కన్వెన్షన్ హాల్



**కడప మన జనప్రగతి మార్చి 08:-** కడప నగరంలోని చెమ్ముమియ్యపేట రైల్వే బ్రిడ్జి కింద ఉన్న భగత్ సింగ్ పార్క్ ఎదురుగా ఎస్ వి కన్వెన్షన్ హాల్ ను ఆదివారం నిర్వాహకులు రాధాకృష్ణ సతీమణి తేజస్విని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కడప నగరంలో ఉన్న భగత్ సింగ్ పార్క్ వద్ద ఎస్వీ ఫంక్షన్ హాల్ అందరికి అందుబాటులో ఉంటుందని సు విశాలమైన ఏసీ ఫంక్షన్ హాల్ పెళ్లి కుమార్తెకు పెళ్లి కుమారునికి ప్రత్యేకమైన గదులు అలాగే విశాలమైన డైనింగ్ హాలు కలదు. ఈ ఫంక్షన్ హాల్ నందు పెళ్లిళ్లకు బర్త్డేలకు రిటైర్మెంట్ ఫంక్షన్లకు ఎంగేజ్మెంట్లకు పార్టీ కార్యక్రమాలకు అన్ని రకాల కార్యక్రమాలు కూడా జరుపుకోవడానికి అందుబాటులో ఉంటుందని జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు తెలిపారు. ఈ ఫంక్షన్ హాల్ కు ప్రత్యేకమైన ఆకర్షణగా భగత్ సింగ్ పార్క్ ఉండడం విశాలమైన పార్కింగ్ స్థలము తో పాటు పిల్లలకు పెద్దలకు ఆలహాదకరమైన వాతావరణ కలదన్నారు. ప్రతి ఒక్కరికి బెంగుళూరులోని బృందావనం గార్డెన్ లో ఉన్నామా అన్నట్టుగా ప్రత్యేక విశేషమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక ప్రవచనాలపై శిక్షణ కార్యక్రమం



**సింహాద్రిపురం మన జనప్రగతి మార్చి 08:-** సింహాద్రిపురం గ్రామంలో పాత ఆంధ్ర ప్రగతి బ్యాంక్ ఆవరణములో ఆదివారం 32 వారాలుగా కొనసాగుతున్న భగవత్ గీత శ్లోకాల శిక్షణ తరగతులు మేడం మేడా సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 8 నెలలుగా విద్యార్థులకు సంస్కారంఆధ్యాత్మిక ప్రవచనం పై శిక్షణ ఇవ్వడంజరుగుతుందన్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రతి ఆదివారం రెండో శనివారం మరియు సెలవు దినాలలో,క్లాసులు నిర్వహిస్తున్నారు అన్నారు. ఈకార్యక్రమం లో నిర్వ హకులుయాగంటి బాలకృష్ణారెడ్డి,విద్యార్థుల తల్లి దండ్రులుతదితరులు పాల్గొన్నారు.

## 3కే రన్‌లో సింహాద్రిపురం అమ్మాయి శివమల్లి రెడ్డికి స్వర్ణ పతకం




**సింహాద్రిపురం మన జనప్రగతి మార్చి 08:-** వైయస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం దిద్దికుంట గ్రామానికి చెందిన క్రీడాకారిణి పి.ఎస్.శివమల్లి రెడ్డి పరుగు పందెంలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన 3 కిలోమీటర్ల రన్ పోటీల్లో ఆమె ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. దిద్దికుంట గ్రామానికి చెందిన పెద్ద సోమప్ప భాస్కర్ రెడ్డి, సావిత్రిల కుమార్తె అయిన శివమల్లి రెడ్డి గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో తన సత్తా చాటుతోంది. శనివారం (మార్చి 7న) గచ్చిబౌలిలో జరిగిన పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన ఆమె ఈరోజు జరిగిన 3కే రన్ ఓపెన్ కేటగిరీలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకుంది. బంగారు పతకం సాధించిన శివమల్లి రెడ్డిని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమని పలువురు రాజకీయ నాయకులు,మేధావులు మరియు అధ్యాపకులు ప్రశంసించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని వారు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

## కాపు ఉద్యమ నేత ముద్రగడతో పులివెందుల వైకాపా నేతల భేటీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:** కాపు సామాజికవర్గ అభ్యున్నతి కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న ప్రముఖ నేత ముద్రగడ పద్మనాభం ని పులివెందులకు చెందిన వైకాపా నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కడపలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరైన ముద్రగడను పులివెందుల 8వ వార్డు కౌన్సిలర్ గాజుల శైలజ, వైకాపా నేతలు గాజుల కృష్ణ సాయి,గాజుల జయప్రకాష్ మరియు ఇతర కాపు నేతలు కలిశారు. ఈ భేటీ సందర్భంగా నేతలు ముద్రగడతో ప్రస్తుత రాజకీయ పరిణామాలు మరియు సామాజిక అంశాలపై ఆరా తీశారు. కాపుల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. ముద్రగడ వంటి నిబద్ధత గల నేతతో తమ భవిష్యత్తు ఆలోచనలను పంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని గాజుల సాయి మరియు జయప్రకాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం కూడా పులివెందుల నేతలతో ఆత్మీయంగా మాట్లాడి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వమే నిలువుటద్దం

● పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ బీటెక్ రవి





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:** మహిళల అభ్యున్నతి మరియు సాధికారతకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మహిళా సదస్సులో బీటెక్ రవి మరియు పులివెందుల జడ్పీటిసి మారెడ్డి లతా రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆడబిడ్డలందరికీ ఆయన మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సభను ఉద్దేశించి బీటెక్ రవి మాట్లాడుతూ 2029 నాటికి చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేసి,పాలనలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గతంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి వారి ఆత్మగౌరవాన్ని పెంచగా,నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా,రాజకీయంగా శక్తివంతులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ మరియు తల్లికి వందనం పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన వివరించారు. పులివెందుల నియోజకవర్గంలోని 41 వేల మంది డ్వాక్రా సోదరీమణుల కోసం ఉన్నతి పథకం ద్వారా ఈ ఏడాది ₹278 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మహిళల రక్షణపై రాజీ పడే ప్రసక్తే లేదని,ఆడబిడ్డల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై పోలీసు యంత్రాంగం ద్వారా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సొంత చెల్లెళ్లను దూరం చేసుకునే సంస్కృతి మనది కాదని,మహిళలను గౌరవించడమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ మహిళ అంటే కేవలం ఒక కుటుంబానికే పరిమితం కాదని,సమాజానికి ఒక మూలస్తంభం లాంటిదని కొనియాడారు. నేటి కాలంలో మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా,ఇంటి పనులు,పిల్లల బాధ్యతలు మరియు కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూనే,అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి మండల ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథ రెడ్డి, ఏపీ స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా,బిజెపి రాష్ట్ర కార్యదర్శి వంగల శశి భూషణ్ రెడ్డి,మడకశిర తెదేపా ఇంచార్జి పేర్ల పార్థసారథి రెడ్డి,నల్లగారి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు తమ ప్రతిభతో సమాజాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు,భారీ సంఖ్యలో డ్వాక్రా మహిళలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 08:-** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన,తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు

**శింగనమల మన జనప్రగతి మార్చి 08:-** శింగనమల మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) భాస్కర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని మహిళా ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు మరియు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్ రావు మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. గృహిణిగా, ఉద్యోగిగా మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారని, వారికి సమాజం తగిన గౌరవం అందించాలని కోరారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఎంపీడీఓ ఘనంగా సత్కరించి, వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.




## మస్తానయ్య స్వామినెల ఉరుసు ఉత్సవాలు



**దేవనకొండ మన జన ప్రగతి మార్చి 08:-** దేవనకొండమండల పరిధిలోని కొత్తపేట గ్రామములో హాజరత్ దేవాని మస్తాన్ వలి నెల ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన అంతర్రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలలో విజేతగా ఎస్. కొత్తూరు వృషబాలు నిలిచాయి. కార్యనిర్వాహకులు గ్రామ సర్పంచ్ కుమారుడు మస్తాన్ వలి, గ్రామ పెద్ద తిక్కయ్యల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. రెండవ విజేత కర్నూలు జిల్లా ఎస్ కొత్తూరు వృషభాలు,మూడవ విజేతగా తుగ్గలి మండలం మారెళ్ళ గ్రామ వృషబాలు,నాలుగు, ఐదవ విజేతలుగా కోడుమూరు మండలం వెంకటగిరి వృషభాలు,ఆరవ విజేతగా తెలంగాణ రాష్ట్రం వనపర్తి మండలం రేవల్లి, నాగర్ కర్నూల్ జిల్లా లింగాల వృషభలు విజేతలుగా నిలిచాయి. మొదటి విజేతకు రూ. 50 వేలు దాతలు శిలారు,ఖాదర్ బాషా,రెండవ విజేతకు రూ 40 వేలు మస్తాన్,రేష్మ, మూడో విజేతకు 30 వేలు దాతలు బడే సాబ్,పెద్ద మస్తాన్, నాలుగవ విజేతకు 20 వేలు దాతలు బోయ రవి, చంద్రశేఖర్, 5వ విజేతకు 10 వేలు దాత ఉపసర్పంచ్ మాదన్న, ఆరవ విజేతకు దాత మహేష్ గౌడ 5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆటో శివ ,ఎంకప్ప,పవన్ రెడ్డి పాల్గొన్నారు.

## 13 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



**రాయచోటిమన జన ప్రగతి మర్చి 08:-** రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 13 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట,రైల్వే కోడూరు,సుండుపల్లె,వీరబల్లి, యర్రావారిపాలెం,కేవీపల్లి,కలకడ, కలికిరి, పీలేరు,గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్.పి.కుంట,చక్రాయపేట,కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 25 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 13 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు. అనంతరం కంటి ఆపరేషన్ల కోసం వచ్చిన కంటి రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ పంచాయతీలోని మోటుకు గ్రామానికి చెందిన దాత ఎన్నారై ఎర్రగొండ గోవర్ధన్ రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా,కోశాధికారి శివప్రసాద్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,కంటి వైద్యులు సురేష్ బాబు,భార్గవి,ఆత్మాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## జాతీయ అబాకస్ పోటీల్లో గంజికుంట విద్యార్థిని మెరుపులు

● అంతర్జాతీయ స్థాయికి 'సాయి ప్రహర్షిత' ఎంపిక




**వజ్రకరూరు మన జనప్రగతి మార్చి 08:-** అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన విద్యార్థిని కె. సాయి ప్రహర్షిత జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఆదివారం తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పి.ఎన్.ఆర్ స్కూల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ఆమె ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. గంజికుంటలోని శ్రీ సాహితీ విజ్ఞాన్ స్కూల్‌లో చదువుతున్న ప్రహర్షిత, అబాకస్ లెవల్-2 విభాగంలో నేషనల్ సెకండ్ ర్యాంక్ సాధించి, తద్వారా అంతర్జాతీయ అబాకస్ పోటీలకు అర్హత సాధించింది. మారుమూల గ్రామం నుండి జాతీయ వేదిక వరకుదేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి అనేక మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్‌లోని ఒక మారుమూల ప్రాంతానికి చెందిన ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ఇంతటి ఘనకీర్తి సాధించడం విశేషం. ప్రహర్షిత ప్రతిభను గుర్తించిన విశ్వం టెక్ సంస్థ ప్రతినిధులు ఆమెకు రూ. 2,000 నగదు పురస్కారంతో పాటు రన్నరప్ ట్రోఫీని అందజేసి గౌరవించారు. పాఠశాల యజమాన్యం హర్షంసాయి ప్రహర్షిత సాధించిన విజయం పట్ల పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, హెడ్ మాస్టర్ జాకీర్ హుస్సేన్ మరియు డైరెక్టర్ ప్రకాష్ తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థినితో పాటు ఆమెకు ప్రత్యేక శిక్షణ అందించిన ఉపాధ్యాయుడు రామాంజనేయులును వారు ప్రత్యేకంగా అభినందించారు. విజయం: జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో సెకండ్ ర్యాంక్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం. మారుమూల గ్రామంలో ఉంటూ కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న శ్రీ సాహితీ విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యాన్ని గ్రామస్థులు, మండల ప్రజలు కొనియాడారు. ప్రతి విద్యార్థి సాయి ప్రహర్షితను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు



**రాయచోటి మన జనప్రగతి మార్చి 08:-** రాయచోటి పట్టణంలోని కొత్తపేట ముస్తఫా వీధిలో ఉన్న ముస్తఫా మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అఫ్రోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ రంజాన్ పర్వదినం ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైనదని, శుభాలు, సిరులు వర్షించే వరాల వసంతం రంజాన్ అని పేర్కొన్నారు. భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు పాటిస్తున్న రంజాన్ ఉపవాసాలు 18వ రోజుకు చేరుకోవడం ఆనందదాయకమన్నారు. ఇఫ్తార్ విందు ఒక పుణ్యకార్యమని, భగవంతుడు దయతో మరియు అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇఫ్తార్ విందులో అందరితో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరి సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించడం సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09 -03-2026

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జావేద్ లతీఫ్, కొండ దయానంద్‌లకు షోకాజ్ నోటీసు

**ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్**

**హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 08:-** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జావేద్ లతీఫ్,కొండ దయానంద్ చర్యలపై వివరణ కోరుతూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా వీరు అనధికారికంగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీలో వర్గవాదం, విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీ తదుపరి రాష్ట్ర మహాసభ జరిగే వరకు, కొత్త రాష్ట్ర కమిటీ ఎన్నికయ్యే వరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా అంబటి జోజిరెడ్డి కొనసాగుతారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ లోని పార్టీ సభ్యులు, నాయకులు, మద్దతుదారులు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, పార్టీని బలోపేతంచేయడానికి అంబటి జోజి రెడ్డికి పూర్తి సహకారం అందించాలని పార్టీ కేంద్ర కమిటీ కోరింది.

## వైవియు కన్వకేషన్‌ను ప్రైవేట్ కళ్యాణ మండపంలో నిర్వహించడం సబబు కాదు

● **వైవియు పూర్వ విద్యార్థి, పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న**




**కడప మన జనప్రగతి మార్చి 08:-** యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించాల్సిన వైవియు కన్వకేషన్ కార్యక్రమాన్ని కడప నగరంలోని ప్రైవేట్ కళ్యాణ మండపంలో నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం సరైనది కాదని వైవియు పూర్వ విద్యార్థి, పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తెలిపారు. ఆదివారం కడప నగరంలోని పీడీఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయానికి స్వంతంగా విశాలమైన ప్రాంగణం, తగిన సదుపాయాలు ఉన్నప్పటికీ విద్యార్థుల గౌరవప్రదమైన కన్వకేషన్ కార్యక్రమాన్ని బయట ప్రైవేట్ స్థలంలో నిర్వహించడం విశ్వవిద్యాలయ ప్రతిష్టకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సంవత్సరాల పాటు చదివి పట్టాలు అందుకునే ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించడం పరిపాటిగా కొనసాగుతోందన్నారు.అయితే ఈ నెల 11, 12, 13, 14 తేదీలలో కడప నగరంలోని ప్రైవేట్ కళ్యాణ మండపంలో నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం విద్యార్థుల భావోద్వేగాలను దెబ్బతీసే చర్య అని ఎం.అంకన్న విమర్శించారు.అందువల్ల వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, వైవియు కన్వకేషన్ కార్యక్రమాన్ని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనే నిర్వహించేలా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు విష్ణు, వెంకటేష్, ఆంజనేయులు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ మెడికల్ కాలేజీ వినూత్న కార్యక్రమం

● **ఇంటి వద్దకే వైద్యం** ● **ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి నారాయణ**



**నెల్లూరు మన జనప్రగతి మార్చి 08:-**పేదలకు అండగా నిలుస్తూ నారాయణ వైద్యకళాశాల ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టిన 'నారాయణ నేత్రజ్యోతి' ఉచిత కంటి వైద్య శిబిరాన్ని 3వ డివిజన్ జాఫర్ సాహెబ్ కాలువకట్ట వద్ద మంత్రి నారాయణ ఆదివారం ప్రారంభించారు. నేత్రజ్యోతి పోస్టర్‌ను ఆవిష్కరించారు . మంత్రికి స్థానికులు, టీడీపీ నేతలు బ్రహ్మరథం పట్టారు. కంటిచూపు మందగించిన నిరుపేదల కోసం ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని, శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు, అద్దాలు పంపిణీ చేయడమే కాకుండా, సర్జరీ అవసరమైన వారిని నారాయణ సంస్థ వాహనాల్లోనే ఆసుపత్రికి తరలించి, చికిత్స అనంతరం తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుస్తామని మంత్రి ప్రకటించారు. రానున్న రోజుల్లో సర్వేపల్లి కాలువకట్ట, పెన్నాకట్ట, గాంధీ గిరిజన కాలనీ, దీనదయాళ్ నగర్ వంటి స్లమ్ ఏరియాల్లో వరుసగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు .నారాయణ నేత్రజ్యోతిని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు . పేదల సేవలో ముందున్న నారాయణ మెడికల్ కాలేజ్ యాజమాన్యాన్ని, వైద్య బృందాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్ ,కంటివైద్య నిపుణులు డాక్టర్ సుధా ,డాక్టర్ వెంకటరమణ ,టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ ,మాజీ జెడ్పిటీసి విజేతా రెడ్డి ,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు ,డివిజన్ క్లస్టర్ ఇంచార్జి పుత్తూరు శైలజ ,ప్రెసిడెంట్ విజయ తదితరులు పాల్గొన్నారు .

## మహిళా సాధికారత..ఆధునిక సమాజంలో మహిళ యొక్క బాధ్యతలు

**రాయచోటి మన జనప్రగతి మార్చి 08:-**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఎ.పి వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆధునిక సమాజంలో మహిళ యొక్క బాధ్యతలు చాలా ముఖ్యమైనవి.మహిళలు సమాజంలో అన్ని రంగాలలో ముందుండి నడిపిస్తున్నారు. వారు కుటుంబం, సమాజం, రాజకీయం, ఆర్థికం, విద్యా, వైద్యం వంటి అన్ని రంగాలలో తమ సేవలను అందిస్తున్నారు.మహిళా సాధికారత అనేది సమాజంలో మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం. మహిళలు తమ హక్కులను తెలుసుకొని,తమ సామర్థ్యాలను పెంపొందించుకొని,సమాజంలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి.ఈ సందర్భంగా,మహిళా సిబ్బందికి,మహిళా సంఘాలకు,మహిళా నాయకులకు,మహిళా సాధికారత కోసం పాటుపడుతున్న అన్ని సంస్థలకు, వ్యక్తులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు



## మహిళలను గౌరవిద్దాం - మెరుగైన సమాజం నిర్మిద్దాం

● **అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెడబల్లి సుష్మ**



**వేంపల్లి మన జనప్రగతి మార్చి 08:-** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను గౌరవించి సమాజ అభివృద్ధికి సహకరించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెడబల్లి సుష్మ పిలుపునిచ్చారు. ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని, ఆ ఇల్లు లేదా సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని ఆమె పేర్కొన్నారు. ఎక్కడైతే స్త్రీలకు గౌరవం లభించదో అక్కడ చేసే ఏ పనులైనా ఫలితాన్ని ఇవ్వవని అన్నారు.మహిళలను గౌరవిస్తేనే మెరుగైన సమాజం నిర్మించగలమని ఆమె చెప్పారు. మహిళలు పురుషులు చేసే ఏ పనైనా సమర్థంగా చేయగలరని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచ వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటామని, మహిళల సాధనలను గుర్తించి వారి కృషిని గౌరవించే రోజు ఇదని తెలిపారు.సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, ఒక మహిళ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాక తల్లి, అక్క, చెల్లి, గురువు, నాయకురాలు వంటి అనేక పాత్రలు పోషిస్తుందని ఆమె అన్నారు. కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు నడిపించే శక్తి మహిళలలో ఉందని చెప్పారు.మన దేశంలో కూడా సరోజిని నాయుడు, ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ, కల్పనా చావ్లా, మదర్ థెరిస్సా వంటి గొప్ప మహిళలు తమ ప్రతిభతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని ఆమె గుర్తు చేశారు. వారు అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మహిళలు చదువుకుంటే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అందుకే మహిళలకు విద్య, గౌరవం, సమాన హక్కులు ఎంతో అవసరమని తెలిపారు.అయితే ఇప్పటికీ దేశంలో మహిళలకు సరైన రక్షణ లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను గౌరవిస్తూ వారి కలలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 08:** ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంపీడీవో ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ మహిళల యొక్క హక్కుల గురించి అన్ని రంగాలలో మహిళలు పురుషులతో పాటు సమానంగా అభివృద్ధి చెందాలని ఆయన తెలిపారు తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను సమీపంలో గ్రంధాలయమునకు వచ్చే విధంగా ప్రోత్సహించినచో పిల్లలు జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు అందరూ మహిళలు వారి పిల్లలను గ్రంథాలయానికి పంపి పిల్లలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు మరియు పురుషులు పాల్గొన్నారు.

## మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు




**రాజంపేట మన జనప్రగతి మార్చి 08:-**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజంపేట లోని ప్రభుత్వ బి సి వసతి గృహము నందు హాస్టల్ వార్డెన్ గా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందిన పి శోభారాణి అనే మహిళను సత్కరించి, ఉత్తమ మహిళా అవార్డ్ ను అందజేశారు. ఈ సందర్భంగా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మహిళామణులు సృష్టిస్తున్న విజయాలు మహిళల గొప్పతనాన్ని చెప్పకనే చెబుతున్నాయన్నారు. గృహిణిగానే కాకుండా వ్యవసాయం మొదలుకొని దేశ సరిహద్దుల్లో రక్షణ వరకు, అంతరిక్ష ప్రయోగాలలో విజయాలను సాధించే వరకు మహిళలు పోషిస్తున్న పాత్ర గణనీయమైనదని, అటువంటి మహిళలను గుర్తిస్తూ జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారికి స్ఫూర్తి నివ్వడమే కాకుండా, వారు సాధించాల్సిన విజయాలను, పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తు చేస్తుందని ఆయన అన్నారు. ఉత్తమ మహిళా అవార్డ్ గ్రహీత శోభారాణి మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా నాకు ఉత్తమ మహిళా అవార్డ్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే మోరే లక్ష్మణ్ రావు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ను స్థాపించి ఎంతో మంది అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు, రక్తదాన శిబిరాలు, వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అహమ్మద్ హుస్సేన్, సుబహాన్ , శివసాయినాథ్ , ఈశ్వర్ వర్ధన్ రెడ్డి, అప్సర్, దాదాపీర్, జగన్ మోహన్ రెడ్డి, సునిల్ కుమార్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొనారు.

## నారీ శక్తికి వందనం


● **సమాజ వికాసంలో మహిళలే కీలకం**

● **సీనియర్ రిపోర్టర్ మాలపాటి శ్రీనివాసులు**



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 08:-**సృష్టికి మూలం స్త్రీ. ఒక కుటుంబం బాగుండాలన్నా, ఒక గ్రామం అభివృద్ధి చెందాలన్నా, దేశం ప్రగతి పథంలో నడవాలన్నా అది మహిళల చేతుల్లోనే ఉంటుందని మాలపాటి గ్రూప్స్ అడ్మిన్, సీనియర్ రిపోర్టర్ మాలపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన మహిళల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రత్యేక సందేశాన్ని అందించారు.ఇంటికి వెలుగు.. దేశానికి బలం మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, నేడు అంతరిక్ష పరిశోధనల నుండి దేశ రక్షణ వరకు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని శ్రీనివాసులు కొనియాడారు. "ఒక పురుషుడు చదువుకుంటే ఆ వ్యక్తి మాత్రమే అభివృద్ధి చెందుతాడు, కానీ ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా వెలుగులోకి వస్తుంది" అనే నినాదాన్ని ఆయన గుర్తు చేశారు.మహిళలను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం. వారి ఆశయాలకు, ఆకాంక్షలకు అండగా నిలుద్దాం."మాలపాటి శ్రీనివాసులు, సీనియర్ రిపోర్టర్.

## జగన్ సీఎం అయ్యే వరకు పాదరక్షలు ధరించనని హాజీవ్ అలీ భీషణ ప్రతిజ్ఞ



**శింగనమల మన జనప్రగతి మార్చి 08:-** రాజకీయ నాయకులపై అభిమానం ఒక్కోసారి అసాధారణ రీతిలో వ్యక్తమవుతుంది. అనంతపురం జిల్లా శింగనమల మండలం బడమిందపల్లి గ్రామానికి చెందిన హాజీవ్ అలీ (ఘన) అనే యువకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పట్ల తనకున్న అంతులేని అభిమానాన్ని చాటుకుంటున్నారు. జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ, అప్పటి వరకు తాను కాళ్లకు చెప్పులు ధరించనని ఘన భీషణ ప్రతిజ్ఞ చేశారు. ఈ క్రమంలో నిత్యం తనకున్న రెండు ఎకరాల పొలం పనుల నిమి త్తం రాళ్లు, ముళ్ల బాటలో దాదాపు రెండు కిలోమీటర్లు చెప్పు ల్లేకుండానే నడుస్తున్నారు. తన అభిమాన నాయకుడు జగన్ మోహన్ రెడ్డిని ఒక్కసారైనా కలవాలనేది తన చిరకాల కోరికని, అప్పటి వరకు తన ఈ దీక్ష కొనసాగిస్తానని అని అన్నారు

## ఘనంగా భూమిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకలు




**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 08:-**ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు భూమిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు సంబరాలు జరుపుకున్నారు పట్టణంలోని బొల్లారం శ్రీ అభయ ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం టీవీ రోడ్డు శివాలయం కూడలి మీదుగా మైదుకూరు రోడ్డులోని భూమిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కార్యాలయంలో అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడైన భూమిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది ఓమిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09 -03-2026

# మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే సమాజ అభివృద్ధి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**టెక్కలి మన జనప్రగతి మార్చి 08:-** మానవ జాతి మనుగడకు ప్రాణం పోసే స్త్రీలు సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింతగా రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ మహిళలు స్వతంత్రంగా ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. గతంలో మహిళలకు సరైన ప్రాధాన్యత లేకపోయినా, స్వర్గీయ ఎన్టీఆర్ హయాం నుంచి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసినట్లు గుర్తు చేశారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం, స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు.ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళా సంక్షేమానికి కొత్త దిశలు తెరుచుకున్నాయని, మహిళల ఆర్థిక స్వావలంబనే ముఖ్యమంత్రి లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. మహిళలు విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. **మహిళలకు సన్మానం చేసిన మంత్రి** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను మంత్రి అచ్చెన్నాయుడు శాలువాలు, గుర్తింపు చిహ్నాలతో సన్మానించారు. మహిళలు కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పాల్గొన్నారు.



# లోన్ యాప్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: చిన్న చౌకు ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి



**కడప రూరల్ మన జనప్రగతి మార్చి 08:-**ఇటీవల మొబైల్ లోన్ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని చిన్న చౌకు ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డా. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుర్తు తెలియని లేదా అనుమానాస్పద లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని ప్రజలకు సూచించారు.ఇలాంటి యాప్‌లు మొబైల్‌లోని కాంటాక్టులు, ఫోటోలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని యాక్సెస్ చేసి అధిక వడ్డీలు వసూలు చేయడం, బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.లోన్ అవసరం ఉన్నప్పుడు అధికారిక బ్యాంకులు లేదా గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థలను మాత్రమే సంప్రదించాలి అని తెలిపారు.లోన్ యాప్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి సూచించారు.

# మంచి ఆరోగ్యానికి శ్రీ సౌస్వీ స్పోర్ట్స్ క్లబ్ అందుబాటులోకి...: బ్యాంక్ మేనేజర్ ఎం.సురేష్.



**కడప మన జనప్రగతి మార్చి 08:-**కడప నగరం మాచుపల్లి రోడ్డు అంజాద్ గోడౌన్ నందు శ్రీ సౌశి స్పోర్ట్స్ క్లబ్ ను నిర్వాహకులు పసల వీరాంజనేయులు ఎస్ఎండి హనీఫ్ లు ఆదివారం ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్యాంక్ మేనేజర్ సురేష్ హాజరై ప్రారంభించి మాట్లాడుతూ కడప నగర ప్రజలకు స్పోర్ట్స్ వల్ల తమ శారీరక లేదా పరిస్థితుల పరిమితులను దాటి గెలవడానికి చూస్తాయి.క్రీడాకారుల కూడా వైపల్యం నుంచి గొప్ప విజయాలను సాధించిన స్ఫూర్తి క్రీడలలో ఉంటాయన్నారు. మనిషికి ఆరోగ్యంగా శారీరకంగా ఉండాలంటే ప్రతి రోజు స్పోర్ట్స్ ఆడితే పుల్లకంగా ఉత్తంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో కోచ్ అనిల్,హాకీ ప్లేయర్ యాసీన్, ప్లేయర్స్ హాకీ నేషనల్ ప్లేయర్స్ క్రికెట్ ప్లేయర్స్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ: డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు

**కడప మన జనప్రగతి మార్చి 08: -** నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించు కోవాలని డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకుసంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam. ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. నేడు సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమండయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారుప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



# మహిళగా పుట్టినందుకు గర్వపడాలి - పిల్లల చదువు చాలా ముఖ్యం: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 08:-**మహిళగా పుట్టినందుకు ప్రతి ఒక్కరు గర్వపడాలని, ముఖ్యంగా పిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ముందుగా తన తల్లికి మరియు అక్కడ ఉన్న మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని,గత ఎనిమిది నెలల్లో 83 బాల్య వివాహాలను అడ్డుకున్నామని చెప్పారు.ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని, ఆడపిల్లలు తమ కాళ్ల మీద తాము నిలబడే వరకు పెళ్లిళ్లు చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే కొడుకులకు ఆడపిల్లలను గౌరవించడం నేర్పించాలని కోరారు.ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు.స్వయం సహాయక బృందాలకు బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా జిల్లాలో సుమారు 1,62,782 మంది మహిళలకు రూ.2200 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందుతున్నట్లు చెప్పారు.జిల్లాలో అక్షరాస్యత శాతం కేవలం 57 శాతమే ఉండటంతో దానిని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న “అక్షరాంధ్ర” కార్యక్రమంలో జిల్లాలో 1.61 లక్షల మంది మహిళలు, వృద్ధులు నమోదు కావడం గర్వకారణమని పేర్కొన్నారు.మహిళలు పట్టుదలతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని, సమాజ అభివృద్ధికి మహిళల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు.అనంతరం డీఆర్‌డీఏ,మెప్మా ఆధ్వర్యంలో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు రూ.2201 కోట్ల ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు,జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# మీసేవ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

## శాసనమండలి సభ్యుడు రాంగోపాల్ రెడ్డికి వినతి



**పులివెందుల టౌన్ మన జనప్రగతి మార్చి 08:-** మీసేవ సంస్థల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేయాలని శాసన మండల సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పులివెందులలోని ఎమ్మెల్సీ కార్యాలయం నందు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తో మీసేవ సంస్థ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలసి గతం లో పాదయాత్ర నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా మీసేవ సంస్థలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను వినతిపత్రం రూపంలో అందించడం జరిగిందని సమస్యలను అసెంబ్లీలో చర్చించి మంత్రి నార లోకేష్ మరియు ప్రభుత్వం యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి వినతిని అందించగా ప్రతిస్పందించిన మండల సభ్యులు రామ్ గోపాల్ రెడ్డి సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్, స్టేట్ కమిటీ సభ్యులు సునీల్, జిల్లా కమిటీ సభ్యులు బాబా పాల్గొన్నారు.

# హరిహర కళాభవన్‌లో యూరో కిడ్స్ చిన్నారుల ప్రతిభా ప్రదర్శన

- ఘనంగా ఓల్డ్ బోయిన్‌పల్లి యూరో కిడ్స్ స్కూల్ అనువల్ డే వేడుకలు
- తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



**సికింద్రాబాద్ మన జనప్రగతి మార్చి 08:** సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఓల్డ్ బోయిన్‌పల్లి యూరో కిడ్స్ స్కూల్ వారి అనువల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్కూల్ చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.పాటలు, నృత్యాలు, చిన్న నాటికలు వంటి కార్యక్రమాల్లో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు మరియు అతిథులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో పిల్లల తల్లిదండ్రులు హాజరై పిల్లలను ప్రోత్సహించారు. చిన్నారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.స్కూల్ ఉపాధ్యాయులు మరియు నిర్వాహకులు పిల్లలను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వేడుకలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చిన్నారుల మధ్య ఆనందభరిత వాతావరణంలో ముగిశాయి.

# న్యూఢిల్లీలో డాక్టర్ బి.ఎస్.శర్మకు జాతీయ స్థాయి ఉగాది పురస్కారం



**రైల్వేకోడూరు మన జన ప్రగతి మార్చి 08:-**రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు,శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ,ధర్మకర్త డాక్టర్ బండాత్మకూరు సుదర్శన్ శర్మకు జాతీయ స్థాయి ఉగాది పురస్కారం లభించింది.ఆదివారం (మార్చి 8) న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆదిలీల ఫౌండేషన్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్నిఅందజేశారు.ఈ సందర్భంగా ఆదిలీల ఫౌండేషన్అధ్యక్షులు డాక్టర్ ఆదినారాయణ చేతుల మీదుగా డాక్టర్ సుదర్శన్ శర్మ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. రైల్వే కోడూరు పరిసర ప్రాంతాల్లో ఆయన చేపట్టిన అనేక సామాజిక,ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు,ముఖ్యంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం మరియు దానికి సంబంధించిన సేవా కార్యక్రమాలు ఆయనకు ఈ గౌరవాన్ని అందించడానికి కారణమయ్యాయి.ఈ విషయాన్ని డాక్టర్ బండాత్మకూరు సుదర్శన శర్మ ఒక ప్రకటన ద్వారా మీడియాకు తెలియజేశారు.సమాజ సేవ,ధార్మిక సేవా కార్యక్రమాల్లో డాక్టర్ సుదర్శన్ శర్మ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు అభినందనలు తెలిపారు.జాతీయ స్థాయిలో లభించిన ఈ ఉగాది పురస్కారం రైల్వే కోడూరు ప్రాంతానికి గౌరవాన్నితీసుకువచ్చిందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174